సాక్షి
తిరుపతి
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



తేర్లపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

బ్రహ్మోత్సవాల్లో నేడు

స్కంధరాత్రి (మాఘ బహుళ అమావాస్య)

వాహన సేవలు

ఉదయం 9 గంటలకు : అధికార నంది – కామధేనువు వాహన సేవ
ఉభయదాతలు: కోత్వాల్ చెంగ్రాయులు జ్ఞాప కార్థం, పసుపులేని రాజగోపాల్ కుమారులు, శ్రీకాళహస్తి (శాశ్వత ఉభయకర్త 2025 వరకు)

భక్తి సాగరంలో.. మునిగితేలారు!

● అంగరంగ వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుడి రథోత్సవం ● రాత్రి తెప్పలపై విహరించిన స్వామి, అమ్మవార్లు



తెప్పోత్సవానికి పోటెత్తిన జనం(ఇన్‌సెట్) తెప్పపై స్వామి, అమ్మవార్లు

రథోత్సవంలో దొంగల చేతివాటం



బంగారు గొలుసు పోగొట్టుకున్న సుభాషిణి

రథోత్సవంలో దొంగలు తమచేతి వాటం ప్రదర్శించారు. తొట్టంబేడు మండలం, కంచనపల్లి గ్రామానికి చెందిన సుభాషిణి అనే మహిళ రథోత్సవానికి రాగా.. నగరి వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు తెంపుకుని వెళ్లారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. తేరువీధి, నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి భక్తులతో కిక్కిరిసిపోయాయి. హరహర మహాదేవ, శంభోశంకర అంటూ స్వామివారి రథాన్ని ముందుకు కదిలించగా.. జైజై కాళీ, జైజై భద్రకాళి నామాన్ని స్మరిస్తూ అమ్మవారి రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవం సందర్భంగా భక్తులు ఉప్పు, మిరియాలను చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ పాల్గొన్నారు.

వివక్షతోనే ఇక్కట్లు
మాజీ కౌన్సిలర్ ఆర్కాటు ముత్తు చాలా ఏళ్లుగా రథోత్సవంలో సేవలందించేవారు. కానీ ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు కావడంతో కూటమి నేతలు కక్ష్య గట్టారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పంపకుండా అవమానించారు. ఈ క్రమంలో రథోత్సవానికి కొత్తవారిని నియమించుకున్నారు. వారు సకాలంలో బ్రేక్‌లు వేయకపోవడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు.

తెప్పోత్సవం
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి నారద పుష్కరిణిలో శివ పార్వతుల తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. విద్యుద్దీప కాంతుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు.

నేడు శివపార్వతుల కల్యాణం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తర్వాత గజ వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి బయలుదేరి పెండ్లి మండపం వద్దకు చేరుకోనున్నారు. అనంతరం సోమవారం వేకువ జామున స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు.



రథోత్సవంలో ఏనుగు ప్రతిమలు

న్యూస్‌రీల్

సీఎం పర్యటనపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చి 1వ తేదీన చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేయనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులంతా సమయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమీక్షలో ఎయిర్‌పోర్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, ఏఎస్పీ శ్రీనివాస రావు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ బాలాజీ నాయక్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరా పెంచండి



మద్దిల గురుమూర్తి, ఎంపీ

తిరుపతి మంగళం : ఖరీఫ్, రబీ సీజన్‌ల కోసం అవసరమైన ఎరువుల సరఫరా పెంచాలని కోరుతూ కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్.సి.ఐ.ఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు గురువారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి లేఖ రాశారు. 2024–25లో 1,19,141 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించినట్టు తెలిపారు. 2025–26 సంవత్సరానికిగాను మరో 25 శాతం పెంచాలని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం 258 ప్రైవేట్ డీలర్లు, 36 వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని, పెరుగుతున్న వ్యవసాయ విస్తరణకు అనుగుణంగా డీలర్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాలని కోరారు. రైతుల ఉత్పాదకత పెంపు, ఆహార భద్రత లక్ష్యాలను సాధించేందుకు సరఫరా పెంపు ఎంతో కీలకమని ఆయన లేఖలో స్పష్టం చేశారు.

3 నుంచి ఆకాశవాణిలో టెన్త్ విద్యార్థులకు కార్యక్రమం



ఆకాశవాణి డైరెక్టర్‌తో పదో తరగతి ఉపాధ్యాయులు

తిరుపతి కల్చరల్ : పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా మార్చి 3వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం చేయనున్నట్టు ఆకాశవాణి తిరుపతి కేంద్రం డైరెక్టర్ ఎం.సుధాకర్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం మార్చి 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 7.15 గంటలకు తిరుపతి ఎఫ్ఎం 103.2, 107.5, మెగా హెమ్ స్టేజ్‌పై వినవచ్చని పేర్కొన్నారు. అలాగే న్యూస్ ఆన్ ఏఐఆర్ యాప్‌పై కూడా వినవచ్చని తెలిపారు. ప్రతి రోజూ ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి విషయ నిపుణులైన ఉపాధ్యాయులు వివిధ అంశాలను వివరిస్తారని వెల్లడించారు. పరీక్షలకు ఆందోళన లేకుండా ఎలా సిద్ధం కావాలి అనే అంశాలను తెలియజేస్తారని తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులందరూ ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిల్లర్..చీటర్!



రైసు మిల్లు

మిల్లర్లు రైతులను దోచుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు. సీజన్ ప్రారంభంకాగానే కల్లాల్లో వాలిపోతున్నారు. రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ధాన్యాన్ని ఒకటికి సగానికి కొనుగోలు చేసి ఆపై మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ బియ్యంగా ఆడించి మార్కెట్‌కు తరలించి రేట్లు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండకపోగా.. ఉక్కళంగా దోచుకెళ్తున్న మిల్లర్లు ఆడించే బియ్యానికి రోజురోజుకూ రేట్లు పెరుగుతుండడం గమనార్హం. దీనిపై అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



జిల్లాలో మిల్లర్ల ఇష్టారాజ్యం

- సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం ధర తగ్గింపు
- తాము ఆడించే బియ్యానికి రేట్లు తగ్గకుండా జాగ్రత్తలు
- తూకాల్లోనూ మోసాలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- కన్నెత్తి చూడని అధికారులు

సూళ్లూరుపేట: జిల్లాలో మిల్లర్ల మాయాజాలానికి రైతులు, వినియోగదారులు బలవుతున్నారు. మొదట సీజన్ ప్రారంభంలోనే మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడుతున్నారు. ఆపై బినామీలతో రేట్లు ఉండవని ఊదరగొట్టి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. చివరగా కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకుండా రైతుల నుంచి ఒకటికి సగానికి కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తమ మిల్లుల్లో ఆడించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆపై ఆ బియ్యం రేట్లు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేతల నుంచి అధికారుల వరకు సహకరిస్తుండడంతో వీరి అక్రమ వ్యాపారం మూడు బస్తాలు.. ఆరు లారీలుగా వర్ధిల్లుతోంది.

సీజన్ ప్రారంభం కాగానే..
వరికోతల సీజన్ ప్రారంభం కాగానే మిల్లర్లు దళారులను రంగంలోకి దింపుతారు. బస్తా ధాన్యాన్ని రూ.1800 దాకా కొనుగోలు చేసి హైప్ చూపిస్తారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను వీరు ఫాలో కానేకారు. ఆ తర్వాత మిల్లర్లందరూ సిండికేట్‌గా మారి దళారుల చేతనే రేట్లు తగ్గిపోయాయని చెప్పిస్తారు. ఉదాహరణకు తమిళనాడులో పంటలు బాగా పండడంతో అక్కడ రేట్లు లేవు.. తెలంగాణలోని కోదాడ, ఖమ్మం నుంచి భారీగా ధాన్యం వస్తోంది. పైపెచ్చు విదేశాలకు ఎగుమతులు ఆగిపోయాయి. అందుకే రేట్లు భారీగా తగ్గిపోయాయని రైతులను కలవర పెడుతుంటారు. ఆ తర్వాత మిల్లర్ల బినామీలు రంగప్రవేశం చేసి రూ.1,600, రూ.1,650 కొనుగోలు చేస్తారు. గత ఏడాది రూ.2,200 అమ్మిన బస్తా ధాన్యం ఈ యేడు ఎందుకు తగ్గిపోయిందో అర్థం కాని పరిస్థితి.

మిల్లర్ల ముడుపులు
మిల్లర్లు సిండికేట్ ఏర్పడి అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ వారికి ముడుపులు చెల్లిస్తారు. ఆపై అధికారులను బుట్టలో వేసుకుని రైతుల కడుపుకొట్టడం ప్రారంభిస్తారు.

ధాన్యానికి- బియ్యానికి తేడా

75 కిలో బస్తా వరి ధాన్యాన్ని రైతుల వద్ద తరుగు కింద మరో ఐదు కిలోలకు కలిపి మొత్తం 80 కిలోలు తీసుకుంటారు. దీనికి బస్తాకు రూ.1,600 నుంచి రూ.1,700కు కొనుగోలు చేస్తారు. 75 కిలోల బస్తాను బియ్యంగా ఆడిస్తే సుమారు 40 నుంచి 45 కిలోలు బియ్యం వస్తాయి. 6 కిలోలు నూకలు, 20 కేజీల తవుడు, 2 కిలోలు పొట్టు వస్తుంది.

అంటే

45 కిలోల బియ్యం	రూ.2,700
6 కిలోలు నూకలు	రూ.240
20 కేజీల తవుడు	రూ.560
2 కిలోల పొట్టు	రూ.80
	రూ.3,600

రేషన్ బియ్యాన్నీ వదలని మిల్లర్లు

ఆంధ్రప్రదేశ్‌లోని రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. వాటిని తాము ఆడించే బియ్యంలో పాలిష్ పట్టి బస్తాకు ఏడు నుంచి 9 కిలోల వరకు కలిపేస్తారు. ఇక్కడ మరొక ట్విస్టు ఏమిటంటే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేటప్పుడు 75 కిలోల ధాన్యం బస్తాకి మరో ఐదు కిలోలు తరుగు కింద లాగేస్తారు. అదే బియ్యం వద్ద కొచ్చే సరికి గోతం మీద నెట్ వెయిట్ 25 కిలోలు అని ఉంటుంది. దాన్ని తూకం వేస్తే 23, 24 కిలోలు మాత్రమే ఉంటుంది. ఈ విషయం తూనికలు కొలతలు శాఖ అధికారుల తనిఖీల్లో బయట పడినా ఎలాంటి చర్యలు ఉండవు. ఎందుకంటే ఆమ్యామ్యాలతో అంతా సర్దేసుకుంటారు మరి.

ధాన్యం కొనుగోళ్లలో తేడాలు

వరి రకం	సీజన్ ప్రారంభంలో ధర రూ.	ప్రస్తుతం రూ.
బీపీటీ జిలకర మసూరి	1,600	1,550
కేఎన్ఎం	1,630	1,580



రైస్‌మిల్లుల్లో కళ్లాంలో ధాన్యాన్ని అరబెట్టిన దృశ్యం

ఆ విషయం తెలియదు

మిల్లర్లు, దళారులు రాజ్యమేలుతున్న విషయం నా దృష్టికి రాలేదు. ధాన్యం ధరలు తగ్గించేస్తున్నారన్న విషయం మాత్రం విన్నాను. – కేఎస్ఎస్.నరసింహారావు, తహసీల్దార్, సూళ్లూరుపేట

మిల్లర్ల ఇష్టారాజ్యం

తిరుపతి జిల్లాకంటే ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే రైస్ మిల్లులు ఎక్కువ. నెల్లూరు నగరం చుట్టూరా వంద నుంచి 150 రైస్ మిల్లులు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పది, శ్రీకాళహస్తిలో మరో పది రైస్ మిల్లులున్నాయి. తిరుపతి, చంద్రగిరిలో ఐదారు మిల్లులు ఉన్నాయి. అదే నెల్లూరులో ఇదొక పెద్ద ఇండస్ట్రీ లాగా ఉంది. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల నుంచి నెల్లూరులో ఉన్న మిల్లులకే ధాన్యం వెళ్తుంది. రేషన్ బియ్యం కూడా నెల్లూరులోని కొన్ని మిల్లులకు వెళ్తున్నట్టు సమాచారం. తమిళనాడులో ఇచ్చే రేషన్ బియ్యం (ఉప్పుడు బియ్యం) నెల్లూరు మిల్లులకే తరలిస్తున్నారు. నెల్లూరు అంటే మిల్లర్ల అడ్డాగా ఉంది.

బియ్యం ధరలు ఎందుకు తగ్గించరు?



నేను గతంలో సుమారు ఐదు ఎకరాల దాకా వరి సాగుచేసేవాడ్ని. ప్రస్తుత పరిస్థితులు బాగోలేక వ్యవసాయం చేయడం మానేశా. కష్టపడి పండించిన పంటను ఎవరో మిల్లర్లు వచ్చి దోచుకెళుతున్నారు. ఆరు నెలలు పాటు పడిన కష్టాన్ని వ్యాపారం చేసుకునే వారు తక్కువ రేట్లతో దండుకుని వెళ్తున్నారు. ఇలా చేస్తే వ్యవసాయంలో అప్పులు తప్ప ఏమీ మిగలవు. ప్రస్తుతం ధాన్యానికి ధరలు లేవు కదా! మరి మార్కెట్లో బియ్యం రేట్లు ఎందుకు తగ్గట్లేదు..?.
– వంకా చంద్రశేఖర్, సూళ్లూరుపేట

ధాన్యానికి రేట్లు లేవు



రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వకుండా మిల్లర్లు సిండికేట్‌గా మారి మోసం చేస్తున్నారు. వారు తయారు చేసే బియ్యానికి మాత్రం రేట్లు తగ్గించకుండా విక్రయిస్తున్నారు. ఇక్కడ చూస్తుంటే రైతు పండించిన ధాన్యానికి రేట్లు లేకుండా చేసి పబ్లిక్ మార్కెట్లోనేమో బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులకు రేట్లు పెంచడమే కాకుండా తూకాల్లో కూడా ఒకటి రెండు కేజీలు తగ్గించి ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. – గాలి మల్లికార్జునరెడ్డి, సుగ్గుపల్లి, సూళ్లూరుపేట మండలం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,323 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,460 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

ఎస్వీయూ దూరవిద్యకు అనుమతులు



ఎస్వీయూ డీడీఈ భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులకు 2024 – 25 సంవత్సరానికి యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతులు మంజూరు చేసింది. జనవరిలో యూజీసీ నిపుణుల బృందం వర్సిటీలో మూడు రోజులు పర్యటించింది. అనుమతుల మంజూరుకు సంబంధించిన అర్హతలపై యూజీసీకి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో యూజీసీ గురువారం ఎస్వీయూ దూరవిద్య కోర్సులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి అనుమతులు మంజూరు చేస్తున్నట్టు గురువారం ప్రకటించింది. దీంతో వర్సిటీ డీడీఈ విభాగంలో 17 కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా డీడీఈ కోర్సుల పునరుద్ధరణకు, అనుమతులు రావడానికి కృషి చేసిన వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- తిరుపతి జిల్లాలో 86 పరీక్ష కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 63,197 మంది విద్యార్థులు
- వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు
- ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. తిరుపతి జిల్లాలోని 86 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మార్చి 1న ఇంటర్ ప్రథమ సంవత్సరం, 3న ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ సబ్జెక్టు పరీక్ష ప్రారంభమవుతుందని వెల్లడించారు. పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. 63,197 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్‌లో 31,325 మంది, ఒకేషనల్‌లో 1,324 మంది మొత్తం 32,649 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 29,448 మంది, ఒకేషనల్‌లో 1,100 మంది, మొత్తం 30,548 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను కళాశాలతో



నిమిత్తం లేకుండా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేవిధంగా విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం అధికారులు 0877–2237200, 0877–2237332 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటుచేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని తెలిపారు.

సీసీ కెమెరా పర్యవేక్షణలో..
తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 144 సెక్షన్‌ను పోలీస్ శాఖ అమలుచేయనుంది.

ఏర్పాట్లు పూర్తి



ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ విద్యార్థులకు అనుగుణంగా బల్లలు, లైట్లు, ఫ్యాన్లు సిద్ధంచేశాం. తాగునీరు, అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించాం. డీఈసీ కమిటీ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నాం.
– జీవీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐఓ, తిరుపతి

క్లుప్తంగా

రైతుల సంక్షేమమే లక్ష్యం


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ రమణ

తిరుపతి సిటీ: చిన్న, సన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా వెటర్నరీ వర్సిటీ పలు అంశాలపై అవగాహన కల్పిస్తోందని ఇన్‌చార్జ్ వీసీ జేవీ రమణ పేర్కొన్నారు. గురువారం వెటర్నరీ వర్సిటీ నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల పెంపకంపై రైతులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత, ప్రధాన శాస్త్రవేత బాలసుబ్రమణ్యం, విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి, కో–ర్డినేటర్ ప్రొఫెసర్ కే.సుజాత పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన ఏసయ్య

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మోటార్ సైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో ఏసయ్య(57) మృతి చెందగా మురుగేశం(48)కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం.. మండలంలోని కసిమిట్టకు చెందిన ఏసయ్య, భీముని చెరువుకు చెందిన మురుగేశం ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి పని ముగించుకుని కంపెనీ బస్సులో పుత్తూరుకు వచ్చారు. అక్కడి నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. మండలంలో జాతీయ రహదారి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి ఇండికేటర్లు లేకుండా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న ఏసయ్య అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కుర్చున్న మురుగేశంకు తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టమ్ నిమిత్తం ఏసయ్య మృతదేహాన్ని, వైద్యసేవల నిమిత్తం మురుగేశాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చస్తున్నట్టు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆశలు.. ఆకాంక్షలు!

బడ్జెట్‌పై ఆశగా ఎదురుచూపు

- వ్యవసాయరంగానికి పెద్దపీట వేయాలంటున్న రైతులు
- అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా నిధులు కేటాయించాలి
- జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి
- సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి
- నేడు పయ్యావుల బడ్జెట్‌పై ఆత్రుతగా ఎదురు చూస్తున్న జిల్లా ప్రజలు



తిరుపతి సిటీ: జిల్లాలో అభివృద్ధి ఊసేలేదు. సంక్షేమం పడకేసింది. గత తొమ్మిది నెలలుగా జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలు కూటమి ప్రభుత్వ తీరుతో విసిగిపోయారు. కక్ష్యసాధింపు చర్యలు తప్ప జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించలేదంటూ విమర్శలు ఎక్కుపెడుతున్నారు. గత ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీసం 20శాతం కూడా అమలు చేయకపోవడంతో నిపుణులు, మేధావులు పెదవి విరుస్తున్నారు. శుక్రవారం ఏపీ అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టే బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా నిధులు కేటాయించాలని, సాగు, తాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించి, వ్యవసాయరంగానికి పెద్దపీట వేయాలని రైతులు కోరుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

గత బడ్జెట్‌ను నీరుగార్చారు

కూటమి ప్రభుత్వం 2024–25లో బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరుపై సర్వత్రా విమర్శలు ఎదుర్కొంది. రైతుకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు అందించేందుకు రూ.4,500 కోట్లు, కౌలు రైతులకు రూ.20 వేలు ఇస్తామని, రూ.1000కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఆపై వాటిని అమలు చేయలేదు. తల్లికి వందనం పథకానికి గత బడ్జెట్‌లో రూ.6,487 కోట్లు కేటాయించినా అమలుకు నోచుకోలేదు. ఈ ఏడాది 2025–26 బడ్జెట్‌లోనైనా సంక్షేమ పథకాలకు నిధులు కేటాయిస్తారా.. లేదోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వ్యవసాయరంగానికి పెద్దపీట వేయాలి



కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా వ్యవసాయరంగాని పెద్దపీట వేయాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలి. అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ రుణాలు, పెట్టుబడి సాయం వంటి వాటికి నిధులు కేటాయించాలి. – అనపల్లి గోపి, యువరైతు, చిట్టమూరు మండలం, గూడూరు

విద్యారంగానికి ప్రత్యేక బడ్జెట్ ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. గత బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఫీజురీయింబర్స్‌మెంట్, విదేశీ దీవెన, స్కాలర్‌షిప్‌లతో పాటు గురుకుల, సంక్షేమ విద్యాలయాలకు సైతం నిధుల కేటాయించలేదు. ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. జాబ్ క్యాలెండర్, డీఎస్సీ ప్రకటన కోసం నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. – వెంకటరమణ, విద్యార్థి సంఘం నాయకులు, వెంకటగిరి

తాగు, సాగునీటిపై దృష్టి పెట్టాలి



వేసవి ప్రారంభమైంది. జిల్లాలో తాగు, సాగు నీటి ప్రాజెక్టులు, చెరువులపై ప్రభుత్వం దృష్టి సారించాలి. తాగునీటి కోసం పద్మావతి రిజర్వాయర్, ఎస్‌ఎస్‌కెనాల్, గాలేరు–నగిరి, సుజల స్రవంతి పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలి. సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులు పూర్తి చేయాలి. తాగు, సాగునీటి ప్రాజెక్టుల పనులు ముందుకు సాగకపోవడం దారుణం.
– చెంచురామయ్య, రిటైర్డ్ ఉద్యోగి, శ్రీకాళహస్తి

ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేయాలి



ఆరోగ్యశ్రీకి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించాలి. బకాయిల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆదుకోవాలి. గత ఏడాదిగా ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రజరుగుతున్నట్లు వార్తలు రావడం బాధాకరం. పేదల ఆరోగ్యశ్రీకి ప్రభుత్వం భరోసా కల్పించాలి. గతంలో ఆరోగ్యశ్రీతో మా కుటుంబానికి రూ.3లక్షల మేర లబ్ధి చేకూరింది. నా భర్త ప్రాణాలను కాపాడింది. అలాంటి పథకాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి.
–కే స్రవంతి, గృహిణి, తిరుపతి రూరల్

తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వాలి



కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏడాది గడుస్తున్నా ఆ ఊసేలేదు. రెండేళ్లకు సంబంధించి తల్లికి వందనం నగదు ఇవ్వాలి. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించాలి. –ప్రమీల, చిరువ్యాపారి, తిరుపతి

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి



జిల్లాలో సంక్షేమ పథకాల ఊసేలేదు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు 2025–26బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఇప్పటికే ఏడాది పాలన గడచినా సూపర్‌సిక్స్ అమలుపై ప్రభుత్వం నోరు మెదపలేదు. – ఎల్ఎస్ లక్ష్మీ, ఎఐఎంఎస్ మహిళా సంఘం, తిరుపతి

ఇంట్లో చోరీ


బీరువాను పగులగొట్టి నగలు, నగదు దోచుకెళ్లిన దుండగులు

చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని దిగువ కాశిపెంట్లలో గురువారం చోటుచేసుకుంది. సీఐ సుబ్బరామిరెడ్డి వివరాల మేరకు.. దిగువ కాశిపెంట్ల గ్రామానికి చెందిన ప్రభాకర్‌చౌదరి ఇటీవల మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల తర్వాత కుటుంబ సభ్యులు బెంగళూరులో ఉంటూ తరచూ ఇక్కడకు వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి పైన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వద్దకు చేరుకుని ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అపై పడక గదిలోని బీరువాలో ఉంచిన 26 గ్రాముల బంగారం, కొంత నగదు నగదును ఎత్తుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గౌరవవేతనం పెంచాల్సిందే


జూడాలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

తిరుపతి సిటీ: వెటర్నరీ జూడాలకు గౌరవవేతనాన్నిపెంచాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు. గత 25 రోజులుగా స్టైఫండ్ పెంచాలని వెటర్నరీ విద్యార్థులు చేస్తున్న న్యాయ పోరాటానికి ఏపీ రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థుల న్యాయపోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

తెలుగు భాషాభ్యున్నతికి సమష్టి కృషి


సమావేశాలను ప్రారంభిస్తున్న వీసీ, మాజీ ఎమ్మెల్సీ

తిరుపతి సిటీ: తెలుగు భాషాభివృద్ధికి సమష్టి కృషి, నిరంతర ప్రణాళికలు అవసరమని ఎస్వీయూ వీసీ సీహెచ్.అప్పారావు తెలిపారు. ఎస్వీయూ తెలుగు అధ్యయనశాఖ, ప్రాచ్య పరిశోధనా సంస్థ, బెంగళూరుకు చెందిన తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూ వేదికగా మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం, విశిష్టత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విదేశీ భాషల పట్ల వ్యామోహం పెరుగుతోందని, తెలుగు భాష అంతరిస్తూ ఉందనే విషయం సత్య దూరమైనదని చెప్పారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం పెరగాలన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి, విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ, సదస్సు సంచాలకులు ఆచార్య రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ల మూర్తి, పరిశోధకులు రమేష్ పాల్గొన్నారు.

రేపు హాకీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో శనివారం ఉదయం 7.30 గంటలకు హాకీ సీనియర్, బాలుర జిల్లా జట్లు ఎంపికకు పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు హాకీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఆదిత్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన సీనియర్ బాలుర జట్టు మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్న 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే బాలుర విభాగపు క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని సూచించారు. వివరాలకు 70131 77413 నంబరులో సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

తిరుపతి అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలు పొడిగించినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 1 నుంచి మే 31 వరకు గడువు పెంచినట్టు వెల్లడించారు. ఆయా మీడియా సంస్థల నుంచి యాజమాన్యం వారు తమ సంస్థలో పనిచేసే జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారికి ఇవ్వాలని సూచించారు. వారు ఇచ్చే స్టిక్కర్లతో ఆర్టీసీలో బస్సు పాస్ పొందాలని తెలిపారు.

చెరువులో పడి వివాహిత మృతి


మృతి చెందిన నవనీత

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం, వికృతమాల చెరువులో పడి వివాహిత మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. వివరాలు.. మర్రిమంద బీసీ కాలనీలో కరివెళ్ల నవనీత (40), భర్త రామ్మూర్తి, కుమారుడు ధరణి(24) నివసిస్తున్నారు. రామ్మూర్తి నిత్యం తాగి, భార్యను హింసించేవాడు. కుమారుడు ధరణి స్థానికంగా ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ తండ్రి మార్గంలో తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో శివరాత్రి రోజున కూడా రామ్మూర్తి మద్యం తాగి ఇంటికి రావడంతో అతని భార్య ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడింది. జీవితం మీద విరక్తి చెందిన నవనీత అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి సమీపంలోని వికృతమాల చెరువులో దూకి మృతిచెందింది.

యూఏఎన్ కార్డుతోనే పథకాలు


యూఏఎన్ కార్డులు అందుకుంటున్న కార్మికులకు

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలు పొందడానికి యూఏఎన్ (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబర్) కార్డు తప్పనిసరి అని కార్మికశాఖ తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలెప్ప స్పష్టం చేశారు. గురువారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆయన కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి పేదోడు ఈ కార్డును చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రమాదంతో మృతి చెందినా లేదా అంగవైకల్యం నెలకొన్నా రూ.2 లక్షల బీమా యోజన పొందవచ్చని చెప్పారు. ఈ కార్డును ఉచితంగానే అందజేస్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీ తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, ఆర్టీసీ సీనియర్ కంట్రోలర్ వీఆర్ కుమార్, కార్మికశాఖ సర్కిల్–1 అధికారి ప్రవీణ్‌కుమార్, సర్కిల్–2 ఆఫీసర్ శ్రీమన్నారాయణ, సర్కిల్–3 అధికారి రాజయ్య పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

తిరుపతి క్రైం: నగరంలోని ఎయిర్‌బైపాస్ రోడ్డులోని ఓ సెలూన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎయిర్‌బైపాస్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఎదురుగా ఉన్న నేచురల్ సెలూన్ మొదటి అంతస్తులో చెలరేగిన మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం వచ్చినట్టు షాపు యజమాని గిరిధర్ తెలిపారని చెప్పారు.

ఆగి ఉన్న ట్రాలీని ఢీకొన్న మినీ వ్యాన్

– అక్కడికక్కడే డ్రైవర్ మృతి


మినీ వ్యాన్‌లో మృతి చెందిన డ్రైవర్ వెంకటేషన్

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారి, ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కథనం.. తమిళనాడు ఊతుకోటకు చెందిన వెంకటేషన్(45) మినీ వ్యాన్ డ్రైవర్. నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వస్తున్న సమయంలో ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కగా నిలిపి ఉన్న ట్రాలీని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. మినీ వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

తిరుపతి సిటీ: స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్‌లోని శ్రీవేంకటేశ్వర అకాడమీలో డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ గీతాంజలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం అకాడమీలో జరగనున్న డెమో క్లాస్‌కు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8179392526, 6303285971 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్

తిరుపతి అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కెనరా బ్యాంక్ తిరుపతి జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయ పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని ఎంఆర్‌పల్లి లక్ష్మీనగర్‌లో నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ నుంచి అన్నిరకాల రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. తిరుపతి రీజనల్ ఆఫీస్ ఏజీఎం నాగరాజరావు, డివిజన్ల మేనేజర్లు శ్రవణ్‌కుమార్, సువర్ణకృష్ణ, హర్ష, స్వాతి పాల్గొన్నారు.

కన్నప్ప కొండపై క్షుద్రపూజల కలకలం


శివలింగంపై నిమ్మకాయలు పెడుతున్న అఘోరా


తలపై నిమ్మకాయ పెట్టి కర్పూరం వెలిగించి పూజలు చేస్తున్న అఘోరా

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కన్నప్ప కొండపై బుధవారం రాత్రి క్షుద్రపూజలు కలకలం రేపాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని కొండమీద ప్రతిష్ఠించిన శివలింగం వద్ద తమిళనాడుకు చెందిన ఓ అఘోరా విచిత్ర పూజలు నిర్వహించాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది. అఘోరా లాగా వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి తల మీద నిమ్మకాయ, దానిపైన కర్పూరం వెలిగించుకుని మంత్రోచ్చారణలు చేస్తూ పూజలు చేశాడు. శివలింగం ముందు అనేక నిమ్మకాయలను నక్షత్రం లాగా పెట్టి మధ్యలో కర్పూరాలు వెలిగిస్తూ ఏదో మంత్రాలు చదువుతూ పూజలు చేయడం భక్తులను భయభ్రాంతులకు గురి చేసింది. ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ ఎవరూ ఆ అఘోరాను ప్రశ్నించలేదు. అక్కడ ఉన్న భక్తులే అఘోరాను ప్రశ్నించారు. తమిళనాడు నుంచి వచ్చానని అఘోరా భక్తులకు చెప్పాడు.

పదవీయోగం సిద్ధిస్తుందనీ!

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆలయం వద్ద అనేక మంది భక్తులు జాగరణ చేస్తుండగా ఓ వ్యక్తి కన్నప్ప కొండమీద శివలింగం వద్ద ఈ విధమైన పూజలు నిర్వహిస్తుంటే అధికారులు ఎవరూ స్పందించకపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపైన పాలకులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

త్వరితగతిన సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు


సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.మౌర్య అధికారులను ఆదేశించారు. పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల్లో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులు గడువు లోపు పూర్తి చేయాలని, కార్యాలయంలోని అందరూ విభాగాధిపతులకు గదులు ఉండేలా చూడాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈఈ రవి, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు సాదుతేజ్

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరి సమీపంలోని ఓ సీతల పానీయం తయారీ కంపెనీ ఎదుట గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసుల కథనం.. శ్రీకాళహస్తి పట్టణం, బీపీ అగ్రహారానికి చెందిన పుచ్చకాలయ కిరణ్ మేర్లపాకలోని తన బంధువుల ఇంటికి వచ్చి, అక్కడి నుంచి బి.శరవణ కుమారుడు సాదుతేజ్(4)ను తీసుకుని ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి బయల్దేరాడు. కాపుగున్నేరి సమీపంలో ఓ కర్మాగారం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై కూర్చున్న చిన్నారి సాదుతేజ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తులో ఉంది.

శివయ్యా..కరుణించయ్యా!



తిరుపతి రూరల్ మండలం, మంగళంలోని ఓ శివాలయానికి రెండు తాబేళ్లు వచ్చి పరమేశ్వరుని సేవలో తరించాయి. ఓ భక్తుడు తాను పెంచుకుంటున్న తాబేళ్లను ఆలయానికి తీసుకువచ్చి పరమేశ్వరుని దివ్యమంగళరూపాన్ని దర్శింపజేశారు. కాసేపు ఆలయ ప్రాంగణంలో తాబేళ్లు తిరుగుతూ ఉండగా భక్తులు ఈ దృశ్యాన్ని చూసి మురిసిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి